# చోటు

ఆఖరి వారం

## మధురాంతకం నరేంద్ర



తామూ సామాన్లలా పడివున్నారు. తోపుదు బండిపైన కొబ్బరిబోండాల్ని తీసుకొచ్చిన కుర్రాడు కొబ్బరి చిప్పల్ని సైతం విలువైన ఆస్థిలా ప్రోగు చేసుకుంటున్నాడు. కూల్‌డ్రింకులమ్మే అతను సీసాలపైన వోపనీర్‌తో శబ్దం చేస్తూ నదుస్తున్నాడు. దూరం నుంచీ తోపుదు బండ్లల్లోంచీ ఆమ్లెట్ల వాసన దంచేస్తోంది.

విశాలమైన వెవకసీట్లో కూర్చున్న యజమానికి కోపమొస్తుందేమోనన్న భయంతో తెల్లటి పడవ కారొకటి విశ్శబ్దంగా రోడ్డుపైన జారుతోంది: యినపరజనులో ముంచి తీసిన అయస్కాంతంలా చుట్టూపోగులు పోగులుగా వేలాడుతున్న మనుషులతో ముసలి టౌను బస్సొకటి ముక్కుతూమూల్గుతూ వెళ్తోంది.

సైకిలుస్టాండు నిండా యింగ్లీషు దినపత్రికల్ని తీసుకొచ్చిన కుర్రాడొకదు క్యూలోని వాళ్లకందరికీ వుచితంగా వాటిని పంచసాగాదు. దినపత్రికకు పిన్‌చేసిన ప్రకటన కాగితాన్ని చదువుతూనే 'చూశావా? యిది రాజా ట్రావిలర్స్ వాళ్ళిచ్చిన కాంప్లిమెంటరీ కాపీ! యేదేశానికైనా యెప్పుడైనా యేరకం టికెట్టుకావాలన్నా నిమిషాల్లో యేర్పాటు చేస్తారట! యింతకూ దీని వోనరెవరో చూశావా నువ్వు!' అంటూ అడిగాదు మద్దలేటికి యెడమవైపున కూర్చున్న మూడోవ్యక్తి. అతని పక్కన కూర్చున్న ఆవిడ తెలియదన్నట్టుగా తలతిప్పింది. నలిగిన తెల్లటి దుస్తుల్లో అతను నిన్నటి దినపత్రికలా విస్పారంగా కనిపిస్తున్నాడు. మడతలు నలిగీనలగని వెంకటగిరి నేత చీరలో ఆవిడ రేపు పూర్తిగా విరియబోయే తిరిపెన పూవులాగుంది.

'మేనేజింగ్ పార్టనర్ ప్రతాప మూర్తి అంటేయెవరో తెల్సా? రాజేంద్రమూర్తి కొడుకు. అదేనోయ్ సిన్మాయాక్టరు. ఆ మధ్య అదెవత్తో సిన్మాయాక్టరు ప్రేమలోపడి కనపడ్డంలేదని రూమరొచ్చింది చూదూ! వాడే వీదూ. మొత్తానికి మూర్తి పెద్ద ప్రయోజకుదు. వోగైపోయిన కొదుకును వెతికిపట్టి వాన్నొక ప్రయోజకుడ్నిచేశాదు. ఆఫీసెక్కడో చూశావూ? స్పెన్సర్ టవర్సులో. అక్కడ పదీ యింటూ పది అదుగుల ఆఫీసుకేనెలకు పాతిక




వేల రూపాయల రెంటుంటుంది. అసలు ఆ ప్లేను కొనేసే వుంటాడు మూర్తి. ఘుహోవుంటే పాలిక లక్షలయివుంటుంది. అదొక లెక్కా మూర్తికి?'

'మీరిద్దరూ స్టేట్స్‌కేనా సార్' అంటూ అడ్డుతగిలాడు శీనూ.

'లేదు మిస్టర్! నా మిసెస్‌ను పంపిస్తున్నాను' అన్నాడతను.

'మే యేరియాకు సార్' అంటూ అతణ్ణే మరింతగా ముగ్గులోకి దించాడు శీనూ.

'చికాగో! తెలుగు మహాసభలు జరుగుతున్నాయక్కడ. డెలిగేట్‌గా నామిసెస్‌కు యిన్విటేషనొచ్చింది' చెప్పడానికిష్టంలేని వ్యక్తిలా ముఖమదోలా పెట్టుకుని నెమ్మదిగా చెప్పాడతను.

అటువైపున కూర్చున్న నల్లటి గడ్డపు యువకుడు 'మహాసభలకేనా సార్! నేనూ అందుకే వచ్చానండీ! నాకూ వచ్చింది యిన్విటేషన్.నా పేరు రమణ్‌జీ. మాది వైజాగ్.మీరు' అంటూ అతడి చేతుల్ని పట్టుకుని వూపేశాడు.

మరింతగా మొహమాటపడిపోతూ అతను 'అయామ్ మార్యకుమార్. నా మిసెస్ పేరు శాంతాలక్ష్మి' అన్నాడు.

ఆమెవోసారి పరకాయించి చూసి 'ఆమె సింగరాండీ' అని అడిగాడు రమణ్‌జీ.

మార్యకుమార్ మరింతగా ముఖం ముదుచుకుని 'కాదండీ! డాక్టరు. మీరేం చేస్తారు?' అని



సమాధానంతో బాటూ ప్రశ్నను కూడా సరఫరా చేశాడు.

రమణ్‌జీ ముసిముసి నవ్వులు నవ్వుతూ 'నేను పాటలు పాడుతానులెండి' అన్నాడు.

'కర్నాటక్ వోకలా?' మొదటిసారిగా శాంతాలక్ష్మి మౌనాన్ని విడిచిపెట్టింది.

'కాదు మేడమ్! లైట్ మ్యూజిక్. లలిత సంగీతం. మొన్ననే వచ్చింది పాస్‌పోర్టు. వీసాదొరికితేయివ్వాలే బయల్దేరేస్తాను. సార్ తోడులేరని కంగారేం వొద్దు మీకు. నేనుంటాను.'

సూర్యకుమార్ అతడి మాటలేవీ వినబడనట్టుగా 'మీకొచ్చిన యిన్విటేషన్ అఫిషియల్ దేనా? యేదీ వోసారి చూపెట్టండి చూద్దాం' అని అడిగాడు. తన ఫైలునంతా తిప్పి చూసి 'అరే! ఇన్విటేషను మరచిపోయానే!' అన్నాడు రమణ్‌జీ. అతడికి వినిపించకుండాభార్య చెవిలో యేదో గొణగసాగాడు సూర్యకుమార్.

అంబస్ గేటుముందు కలకలం మొదలయింది. కీ యిచ్చినట్టుగా క్యూ బిగుసుకుంటూ రాసాగింది.

'యేడున్నర. సరిగ్గా టయానికే యింటర్వ్యూలు మొదలెట్టేశారే' అన్నాడు రమణ్‌జీ.

రోడ్డుపైన ఎర్రరంగు కారొకటి జారుతూ వచ్చి ఆగింది. అందులోంచి పొడవుగా లావుగా వున్న శాల్తీ వొకటి కిందికి బదిలీ అయ్యింది. అతడి పిల్కుజుట్టు సూర్యకిరణాల్ని పరావర్తనం చేస్తోంది. పెద్ద అంచులున్న పంచ, అంగవస్త్రమూ సగానికి సగం నేలపైన జీరాడుతున్నాయి. తాంబూలంతో ఎర్రనైన పెదవులు నుదుటిపైని కుంకుమ బొట్లతో పోటీపడుతున్నాయి. బట్టతలని కప్పిపుచ్చడం కోసం అటూ యిటూ వొడతిప్పి అతికించిన వెంట్రుకలు మాడరన్ పెయింటింగ్‌ను తలపిస్తున్నాయి.

'ఆయనేసార్! అంతర్వేదుల సుబ్రమణ్యశాస్త్రి.. మీకు పరిచయం లేదా?' శీనూ గాయకుడ్నీ, నర్తకినీ వొక్కసారిగా ప్రశ్నించాడు. యిద్దరూ తమనిగానట్టుగా మౌనంగా వుండిపోయారు. సూర్యకుమార మాత్రం 'హైద్రాబాదులో కలిసినట్టున్నాను. పెద్ద గాయకుడు కదండీ!' అన్నాడు.

'భలే వాళ్ళే సార్ మీరు! ఆయన పెద్ద మృదంగం ప్లేయర్. యిరవై నాలుగ్గంటలూ మృదంగం వాయించి కంకణం తొడుక్కున్నాడు. గొప్ప భుజబలముండే మనిషి'

'సార్ సార్! ఆకారులో దిగిందెవరో గుర్తుపట్టారా మీరు?' శీనూ మాటలు పూర్తి చేయక మునుపే రమణ్‌జీ గొంతు చించుకున్నాడు.

మద్దలేటి కూడా వోసారి కారులోంచీ దిగిన అమ్మాయికేసి పరీక్షించి చూశాడు. సన్నగా పొడుగ్గా జిరాఫీలాంటి ఆకారం. బ్యూటీ పార్లల్‌లో ముస్తాబైన తలవెంట్రుకలు.వీలైనంత ఎక్కువబట్టనుపయోగించి కుట్టిన పసుపురంగు చుడీదార్.

'జాహ్నవి సార్, రెండు సినిమాల్లో హీరోయిన్‌గా కూడా చేసింది. తమిళ్లో కూడా ఫేమస్సే. మీరు గుర్తుపట్టలేదా?' రమణ్‌జీ ఆశ్చర్యపడిపోయాడు.

జాహ్నవి పేవ్‌మెంటు దగ్గరికొచ్చి సిల్కుని క్యూనోసారి కలయజూసింది. అయిదు నిముషాల తర్వాత క్యూలోంచీ వో యువకుడు సైకిలేచి ఆమె దగ్గరికి నడచాడు. ఆమె భుజాల పొడవున్నాడతను. సన్నటి అతడి శరీరంలో పొడవుగా సుడితిప్పిన మీసాలు యెబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. పిలిథంగు పాంటు పైన లూజు తాజా కాటన్ చొక్కా తెలతెలలాడుతోంది.

రెండు మూడు నిముషాలు మాట్లాడిన తర్వాత తన వానిటీ బాగులోంచీ. గుప్పెడు నోట్లు తీసి అతడికేసి చాచిందామె. అతను శరీరమంతా మెలితిరుగుతుండగా హావభావాలు ప్రదర్శించసాగాడు. కాస్సేపటి తర్వాత అతను దూరంగా వెళ్ళిపోయాడు. జాహ్నవి అంతవరకూ అతను కూర్చున్న స్థలంలోకెళ్ళి కూర్చొంది.

'ఆ కారు దగ్గర నిలబడిన మనిషి అన్నట్టేంటీ నిన్ను రమ్మనిపిలస్తావుండాడు.చూళ్లేదా నువ్వు' అన్నాడు శీనూ మద్దులేటితో.

'నన్నా! యేల?' అంటూ విస్తుపోయి, 'యిప్పడే వస్తాను. కొంచెం నాతావు చూపెట్టుకొండు' అని అతడికి తన స్థలాన్ని అప్పగించి కారుదగ్గరికి నడచాడు మద్దులేటి.

'వాట్ మాన్! తమిళ్, ఇంగ్లీష్ ఆర్ మలయాళం?' అంట వాకబుచేశాడు కారుయజమాని.

'తెలుగు' అన్నాడు మద్దులేటి.

'ఐకెన్ మానేజ్ విత్ తెలుగు ఆల్సో హ్లెస్కెంత తీసుకుంటావు?'

మద్దులేటి అయోమయంగా చూశాడు.

అతను వో పెద్ద నోటు మద్దులేటి చేతికిస్తూ 'బేరం వొద్దు. ఐ థింక్ దిస్ యీజ్ మోర్‌దేన్ యెనఫ్. కమాన్' అని. అతను మద్దులేటి భుజం పట్టుకుని క్యూ దగ్గరికి లాక్కొచ్చాడు. తానే క్యూలో నిల్చుంటూ, గొంతు పెద్దది చేసి 'వోకే. నువ్వు పో. ఐ విల్ స్టాండ్ హియర్'

అన్నాడు. తనకు బాగా పరిచయమున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్టుగా.

'తమాషాగా లేదుటండీ. యెవరూ జాహ్నవిని గుర్తుపట్టలేకపోయారు'. అయిదారు అడుగులు సాగించే వరకూ రమణ్జీ మాటలు మద్దులేటికి వినబడుతూనే వున్నాయి. 'ఆమె గూడా మహాసభలకే వస్తున్నట్టుంది. పెద్దపెద్ద స్టార్లందరికీ ఆహ్వానాలొచ్చాయట. వాళ్లందరికీ వీసాలు అవే పరిగెత్తుకెళ్తాయి. విమానాల్లో స్పెషల్ సీట్లుంటాయి. అలాగని జాహ్నవి చిన్న ఆర్టిస్టేమీగాదు. ఆమె స్టైప్పలేస్తే హాలుహాలంతా మోతే! మెద్రాసులో తనకి లంకంత యిల్లుందట. చుట్టూ గార్డనే ఎకరాలుంటుందట. ఆ మధ్య సిన్మా పేపర్లో వేశారు.'

## ఫ్రం రష్యా విత్ లవ్

అమెరికా–రష్యాల మధ్య కోల్డ్‌వార్ సమసిపోయింది. ఆ స్థానంలో ఇప్పుడు కొత్త బాంధవ్యాలు చోటు చేసుకుంటున్నాయి. రష్యన్ మహిళలని వివాహం చేసుకోడానికి, అమెరికన్ బ్రహ్మచారులు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని మైక్ హాన్సన్ అనే వ్యాపారస్తుడు 'స్కాన్నా ఇంటర్నేషనల్' పేరిట కేష్ చేసుకుంటున్నాడు. అమెరికన్నని వివాహం చేసుకోవాలనుకునే రష్యన్ మహిళల ఫోటోల 'మెయిల్ ఆర్డర్ కేటలాగ్స్'ని ముద్రించి అమెరికన్ బ్రహ్మచారులకి పంపుతున్నాడు. వాళ్ళకి నచ్చిన వాళ్ళ చిరునామాని 10 డాలర్లకి అమ్ముతున్నాడు. ఇంత దాకా 30008 మంది చిరునామాలని అలా అమ్మాడు హాన్సన్.

–డి. పద్మజ

'మధ్యాహ్నం నించీ యీ ముందరుండే యీధి లోనే నాలుగు తూర్లు విచారిస్తా తిరిగినాను. అంతా పెద్ద పెద్ద మేడలే వున్నాయి. యెవరూ పక్కన్నే యిట్లాంటి కాలనీ వుండాదని యెవురూ చెప్పలే. సాయంత్రం ఆ టర్నింగులో నువ్వు గాని కనబడక పొయ్యుంటే యింక యెనక్కు దిరుక్కోని పొయ్యుండాల్సిందే' మాసిమెత్తబడిన దిండును గోడకానించుకుని కూర్చున్న మద్దులేటి పాత తమిళ పత్రికతో విసురుకుంటూ అన్నాడు.

కిరోసిన్ స్టవ్వు ముందు కూర్చుని సత్తుగిన్నెలో వుడుకుతున్న కూరను గరిటెతో కలయతిప్పుతున్న పోతన్న అతని మాటలు వినబడనట్టుగా మౌనంగా వుండిపోయాడు.

ఆరడుగుల వెడల్పుతో ఏడడుగులపొడవున్న పందులాంటి గది. కిరోసిన్ పొగతో నల్లబారిన గోడలు గుడ్డిగా వెలుగుతున్నవిద్యుద్దీపపువెలుతురులో మరింతగా డీలాపడిపోతున్నాయి. గోడకున్న తలుపులు లేని అలమారునిండా రకరకాల పాత్రలూ, తప్పాలూ, బట్టలూ క్రిక్కిరిసిపోయివున్నాయి.మరో గోడకున్న చీలలపైనంతా మాసిన పాంట్లూ షర్టూ వేలాడుతున్నాయి. వొకదానిపైన వొకటిగా పేర్చిన రెండు ట్రంకు పెట్టెల పక్కన, సగం వరకూ నీళ్లున్న ప్లాస్టిక్ బకెట్లు రెండున్నాయి. యెదుటి గోడకున్న కిటికీ కింది తలుపులు రెండూ మూసేసి అలమారుగా మార్చుకోవడంతో అక్కడ అద్దమూ దువ్వెనా, నూనెసీసా,పౌడరు డబ్బా స్థలం సంపాదించుకోగలిగాయి. తెరిచిన కిటికీ తలుపుల్లోంచి దూరంగా మండుతున్న మంటల దాలు ప్రతిఫలిస్తోంది. చర్మం కాలుతున్న కమురు వాసన కడుపుని తిప్పేస్తోంది.యిదేమీ పట్టనట్టుగా పోతన్న మాత్రం గరిటెలోంచీ కొద్దిగా కూరను పైకెత్తి తన్మయత్వంతో రుచిచూస్తున్నాడు.

'యింత పెద్ద వూళ్ళో యిది తప్ప యింకో చోటు దొరకలేదా నీకు? శ్మశానానికింతపక్కంగా యీడెందుకు యిండ్లు కట్టినారు వీళ్లు?' తలతిప్పితే శ్మశానంలోంచీ మంటలు కనబడతాయేమోనని బయటపడుతూ అడిగాడు మద్దులేటి.

గిన్నెలోకి స్పూనుతో పసుపు పొడిరాలుస్తూ 'భలే ట్లోడివే. యిండ్లు గట్టకుండా యింతపెద్ద బరియల్ గ్రౌండు నెట్ల యిడిసిపెట్టినారు వీళ్లు అని నేను అనుమానపడతాంటే' అంటూ సాగదీశాడు పోతన్న.

స్మశానం లోంచీ టపటపమన్న శబ్దం వినిపించింది. మద్దులేటి శరీరంపై వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

'దినమ్మూ యీమాదిరిగా కాలతానే వుంటిందా అక్కడ?' వణుకుతున్న గొంతు తనకే చిత్రంగా అనిపిస్తుండగా మద్దులేటి ప్రశ్నించాడు.

'యీపొద్దు తక్కువలే. వొక్కోప్పుడవుతే పదిరవై మంటలు మండతాంటాయి.యీసైడ్లోయిదొక్కటే బరియల్ గ్రౌండు. యీమధ్యనే ఎలక్ట్రికల్ క్రిమెటోరియం పెట్టినారంట. అయినా రష్ తగ్గటంలే' మరోసారి కూరను శబ్దంచేస్తూ జుర్రుకుని ఆ తర్వాత చెప్పసాగాడు పోతన్న. 'ఆపక్క అది. మన రూంలో మనం. ఆడేం జరగతాందో మనకేలబ్బీ. ఆ మాటకొస్తే దినమ్మూ కొన్నినూర్ల మంది పైకి బోతాంటారు. రోడ్డుమింద దినానికొకటిటి రెండు పీనిగల్నయినా చూస్తానే వుండాల్ల. అట్లనిజెప్పి మన పనులు మనం చెయ్యాటంలే. దానికదే. దీనికిదే. అవుతేవొకటి.యీ బరియల్ గ్రౌండు పక్కనని చెప్తే యీ రూంరెంటు చీప్‌లో పడింది. నెలకు నన్నూరు. మా రూంమేటుకు యిన్నూరు. నాకిన్నూరు.'

'యీ రూంలో నీకు రూమ్మేటు కూడా వుండాడా?' మద్దులేటి ఆశ్చర్యపడిపోయాడు.

'లేకపోతే మొత్తం లెక్క నన్నేగట్టమంటావా? యెందుకు దండగ? నేను పొద్దన యెనిమిదికి పోయినానంటేరాత్రి యేడుకు వస్తాను. మా రూమ్మేటుకు సాయంత్రం ఆరు నుంచీ తెల్లారి ఆరుదాంకాపని. ఆదేందో డైలీ పేపరులో వుద్యోగం. స్నానం గీనం చేసేదానికీ, వంటొండుకునే దానికీ,పండుకోని నిద్రపొయ్యేదానికే గదా రూం. పనుల్లోనేముండను. రాత్రుల్లో వాడుండడు. అదీ సౌకర్యం' మసిగుడ్డతోపాత్రను స్టౌపైన్నుంచీ కిందికి దించి మంటనునీళ్లతో ఆర్పేశాడు పోతన్న.

కిరోసిన్ వాసన గదినంతా ఆక్రమించేసింది.బయటి నుంచీ పెద్ద మూలుగు వినిపించింది.

'పక్కింటి ముసలాయిన బాత్రూంలో పడకేసినట్టుండాడు. టయిం తొమ్మిదిన్నరయిండాల్ల. రారా భోంచేద్దారి' అంటూ పోతన్న ప్లేటులోకి వేడివేడి అన్నంతోబాటూ కూరను కూడా వడ్డించాడు.కమురు వాసనతో బాటూ కిరోసిన్ వాసనని పెనవేసుకున్న కూరవాసన ముక్కుపుటాలకు తగలగానేమద్దులేటికి కడుపులో దేవినట్టయింది.

బలవంతంగా రెండు ముద్దలుమింగి 'పక్కింటి పెద్దాయన బాత్రూంలోపండుకుంటాడా' అని అడిగాడు మద్దులేటి.

'పక్క నుండేది గూడా యింతరూమే. అదేవంటిల్లూ అన్నీ ఆయన యేందో బొమ్మల ఫాక్టరీలో పని చేస్తాడు. ఆ పెద్దాయన వాళ్లనాయిన. రాత్రుల్లో ఆయిన పెండ్లామూ వాళ్ళ నాలుగేళ్ళపాట్టెగాడూ లోపలేపండుకుంటారు. యీరెండూ రూంలకూ వొకేబాత్రూం. రాత్రయితే పెద్దాయిన అడ్నేపండుకోవాల్ల. పైన రూఫ్ లేదుగదా. వానొస్తే పాలిథిన్ కాగితమొకటి కప్పుకుంటాడు. ఆస్మా. రాత్రంతా మూలగతాంటాడు. ఆ మూలుగు వినపడ్లేదంటే ముసిలాయిన చెంబెత్తుకోని ఆ బరియల్ గ్రౌండు యెనకపక్కుండే మురిక్కాలవలోకి పోయినాడూ అని అర్థం. అప్పుడింక తెల్లారిపోయిందనుకోని మనం గూడా ఆ పక్కకు బయల్దేరచ్చు. మరో



# కథ బాగుంది

ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఉక్రేన్ దేశపు యువతి 30 ఏళ్ళ హెలెన్ డెమిడెంకో ఒక నవల వ్రాసింది. ఆ నవల పేరు 'కాగితం మీద సంతకం పెట్టిన చెయ్యి'. ఈ నవలకు మూడు అవార్డులు వచ్చాయి. ఈ నవల వేడివేడి బజ్జీల్లా అమ్ముడుపోతున్న సమయంలో ఎన్నో విషయాలు బయటపడ్డాయి.

ఈ నవలలోని కథ కేవలం కల్పితమై ఉంది. దాన్ని రాసిన రచయిత్రి ఉక్రేన్ దేశపు పేద అమ్మాయి కాక ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగిన హెలెన్ డార్విన్ అనే ఆంగ్ల మహిళ.

రచయిత్రి తప్పించుకుని తిరుగుతుండడంతో ఆమె అన్న 'ఇది కేవలం అమ్మకానికి చేసిన స్టంట్' అని పత్రికల వారికి నిజం చెప్పేవాడు. అది సరే! అయితే బహుమతిగా ఇచ్చిన 30 వేల డాలర్లు డబ్బు తిరిగి పొందడం ఎలా? అని అవార్డులు ఇచ్చినవారు బాధపడడం లేదు. 'పోనీలే కథ చాలా బాగుంది' అని ఊరుకుండిపోయారు! కథ బాగుంది కదూ!

—మంజూష

సారి కంచం నిండా వడ్డించుకుంటూ 'ఆఫీసు కాడ బెల్ ఫ్యాక్టరీ వాళ్లకాంటీనుండాది. ఆడయితే ఆర్రూపాయిలకే కన్సెషన్లో మీల్సు. మధ్యానాల్లో ఆడ్నే భోంచేస్తాను. రాత్రులోమాత్రం వండుకోని ఫుల్‌మీల్స్ తినాల్సిందే' అన్నాడు పోతన్న.

'నేను రాసిన జాబు చేరిందా లేదా నీకు?' చాలా సేపటి నుంచీ అడగలేకపోతున్న ప్రశ్నను చివరకు గ్రుక్కిళ్లు మింగుతూ అడిగాడు మద్దులేటి.

బిగ్గరగా శబ్దం వచ్చేలా మంచినీల్లు మింగుతూ 'నీ రీసెర్చి సీటు కతేమయింది?' అని ప్రశ్నించాడు పోతన్న.

'యెంట్రెన్సులో సరిగా యిరవయ్యయిదు మార్కులొచ్చి యెలిచిబిలిటీ వచ్చింది. మెరిట్ ప్రకారం యెంఫిల్లో సీటు వాదాంకారాదు. పీహెచ్డీలో సీటు గావాల్లంటే గైడు సైను చెయ్యాల్ల' అన్నంలో ముగ్గులు గీస్తూ మద్దులేటి చెప్పసాగాడు. 'యెంత అడుక్కున్నా యెవురూ గైడు జేసే కొస్తకోలే. రీడరు సిద్దయ్య మూర్తి దగ్గిర రెండు పీహెచ్డీసీట్లున్నాయి' అడిగితే ఆయన పెద్ద లెక్చరిచ్చినాడు'

తింటూనే 'యేమంటాడు?' అని అడిగాడు పోతన్న.

'అడ్మిషన్లన్నప్పటినించీ నన్ను గమనిస్నానేవుండాడంట. డిగ్రీలో నతి సంవత్సరమూ నాలు గైదుసార్లుర్రాస్తేగానీ పాసుగాక పోయిందానివల్ల అప్లికేషనులో కూడా పెద్దకట్ట సర్టిఫికెట్లు పెట్టినావంట.పోనీ యెమ్మేలో జేరినాంకయినా సబ్జెక్టుమింద కమిట్‌మెంటు లేదంట. రెండేడ్లలో యేపొద్దూసరింగా పాఠం యినలేదంట. కొట్లాటకొస్నారని బయపడి క్లాసులో అందురికీ ధర్మం మార్కులేసినారంట. అందువల్లపాసయ్యిపోయి, యెంట్రెన్సులో జస్ట్ యెలిజిబిలిటీ దెచ్చుకోని క్రాం దీస్నావుండానంట. కమిట్‌మెంటులే వోళ్లకు రీసెర్చిలెందుకన్నాడు? చివరి ముద్దను బలవంతంగా మింగుతూ చెప్పాడు మద్దులేటి.

'యింక మీదట సరింగానే చదవతానని చెప్పలేక పోతివా?' పాత్రలోని అన్నాన్ని గరిటెతో పూడుస్తూ అడిగాడు పోతన్న.

"ఆయనకు మాత్రం మన సంగతి తెలవదా? స్కాలర్ షిప్ వస్సాది. రెండేళ్ళు కాలం తొయ్యవచ్చునని రీసెర్చిలో జేరతారని ఆయన కంప్లయింటు. నిజమే! దానికి గాకపోతే బో పొడిచేద్దామని యెవుడనుకుంటాండాడు?.. యేందో హాస్టళ్లలో సీట్లొస్సాండివాయని, అత్తెసరు మార్కుల్తో పాసయితాండినా కాలేజీలో సీట్లొస్సాండివాయనీ యింతదాంకా చదివినాను. యెప్పుడు క్లాసులకు పోయినామో, యేం జదివినామో యెవుడికి తెల్సు. యింటికాడుంటే రచ్చలూరంపుల్తో బతకాల. నిప్పకోడి యిసకలో తలపూడ్చుకున్నెట్టు సదువుల్లో మనసు బెట్టెనీకి యెవురివల్లయితింది? బో కమి



ట్‌మెంట్‌లే తీ.. మా అన్నింకా జైల్లోనే వుండాడు. వాళ్ల పిల్లకాయలిద్దురూ ఆస్టల్లో జేరి సదవతాండారు. నేనావక్కగనపడితే మా అమ్మనుకూడా బయిటికంపించి వేరే కాపరం పెట్టుకోమంటాంది మా వదిన. చదువుకున్నోడని కూలీక్కూడా యెవురూ పిలవటాంలె! కోర్టు యవహారాల్లో తల దూర్చినానని బెరైటీస్ పనులకెవుడూ రానీడంలే! యెమ్మే పిలాసఫీ అంటే కాన్వెంట్ స్కూలోళ్ళు గూడా టీచరు జాబు లేదంటాండారు.."

గిన్నెలు కడిగి లోపలపెట్టి, పాతచాప పరిచాడు. పోతన్న. పాత దినపత్రికలు బొత్తిగా పెట్టి, దాని పైన టవలు కప్పి "యిదే నీదిండు. నువ్వావక్క తలపెట్టుకుని పండుకో, నేనీవక్క తలపెట్టుకుంటాను. పక్కపక్కనే పండుకుంటే తావు జాలదు" అన్నాడు పోతన్న.

బిడియంగా మద్దులేటి పడకపైన సర్దుకున్న తర్వాత "యీడగూడా ధడీమని జాబుగావాల్లంటే దొరకతాదా? నాలుగేండ్లుగా వుండాను గాబట్టి, రెండు మూడు తావుల్లో చిన్న చిన్న వుద్దోగాళ్ళు, వొకటి రెండు తావుల్లో టైపింగ్ జేస్నావుండాను గాబట్టి, నెలకో రెండువేలు సంపాయిస్సాండా. యింటికంపించే దానికేమీ మిగలేదిలే. ఆ పక్క శ్రీపెరంబదూరుకాడ ప్లాటేసినారు. నెలనెలా ఆరు నూర్లు కడతాండాను. యింకో మూడేండ్లు కట్టాల. రెండు యాస్‌బెస్టాస్ సీట్లేసినాయిల్లే... ఆ పన యిన్నాంకే పెండ్లని యింట్లో చెప్పేసినాను.."

లైట్లార్పేశాక కిటికీలోంచి మంటలడాలు బాగా పడుతోంది. పైన ఫాను తిరుగుతున్న గదిలో గాలి ఆడడం లేదు. చెమట వాసన తప్పించుకోవడం కోసం ముఖమటు తిప్పకున్నాడు మద్దులేటి. మురిక్కాలవ వాసన ముకుపుటాలకు తగిలింది.

వున్నట్టుంటి ధిగ్గున లేచి కూర్చున్నాడు మద్దులేటి. పోతన్నను బలవంతంగా నిద్రలోంచి లేపి 'ముసిలాయన మూలుగు యినపడాంటంలే' అన్నాడు కంగారుగా.

విసుగ్గా అతడినోసారి చూసి, మరోసారి ఆవులిస్తూ "ముసిలోడు తావు ఖాళీ చేస్తాండాడేమో! వాళ్ళ వాళ్ళ తమ్ముళ్లే పిలుచుకొనొచ్చేకి పక్కంటామే పక్కింటాయన పోటీ పడతాండాడు. యెవురో వొకరొస్సారు.." అని కాస్సేపాగి "తెల్లారీ తెల్లారక ముందే మా రూమ్మేటు వచ్చేస్సాడు. అట్లకాళ్ళు ఆపక్కా, యిట్ల చేతుతో పక్కా యేనుకుని రూమంతా పనుకునేస్సాడు. నేనూ డూటీకి పోవాల్ల. నీ అడ్రసిచ్చేసి పో! యేదయినా జాబ్ దొరికితే జాబురాస్సాను.." అంటూ నిద్రలోకి జారిపోయాడు పోతన్న.

గదిలో ఫాను గరగరలతో బాటు పోతన్న గురక కూడా అంతకంతకూ పెరిగిపోసాగింది. స్మశానం నుంచి చిటపటలు వినిపిస్తున్నాయి. దూరం నుంచీ యింకా వాహనాల సవ్వడి గూడా వినబడుతూనే వుంది. మురికి కాలవ దగ్గరనుంచి అప్పుడప్పుడు పందిపిల్లలు కీచులాడుకుంటున్న శబ్దం సైతం వినబడుతోంది. యెంతగా చెవులు రిక్కించి విన్నా బయటపడుకున్న ముసలాయన మూల్గుడు మాత్రం యెంతకు వినిపించక పోవడంతో మద్దులేటి భయపడుతూనే వుండిపోయాడు.

* * *

జెమినీ సర్కిల్ వాహనాల శబ్దాన్ని రెట్టింపు చేసే ఆంప్లిఫయర్‌లా తయారైంది. యెండ వేడికి కరుగుతున్న తారురోడ్డుపైన వాహనాలు ముద్రిస్తున్న టైర్లగుర్తులు నగరపు సంచలన వార్తల్లా క్షణక్షణానికీ మారిపోతున్నాయి. అంతస్థులు అంతస్థులు పెరిగిన భవనాల చేతుల్లో దొరికిపోయిన ఆకాశం తెల్లగా బిక్కమొహమేసుకుని చూస్తోంది. దాదాపుగా పోషొచ్చి వుండలు చుట్టుకుపోయిన వ్యక్తులతో క్యూ యెండగట్టిన చేపపిల్లల దారంలా కనిపిస్తోంది. పెద్దవుండని దొర్లించుకుంటూ వేళ్ళే పేడపురుగులా నడివయను మురికిబట్టల మనిషొకడు తనకంటె పెద్దదిగా వున్న పాతగోనెసంచిలో క్యూదగ్గర పడిన దినపత్రిక కాగితాల్ని, ఆయిల్ పేపర్లను ప్రోగు చేసుకుంటూ వెళుతున్నాడు.

క్యూపక్కనే నడుస్తూ ముందుకెళ్ళిపోయిన టీషర్టు కుర్రాడు మళ్ళీ వెనక్కు వచ్చి "యిన్నాంగో! నీ సాయెన్నాచ్చి? రేవుటి క్యూలో కూర్చుంటిరా?" అని అడిగాడు. మద్దులేటి మౌనంగా వుండిపోవడంతో "నాకు నీసాయిచ్చూడ్సిఆరు" అని విజయగర్వంతో ప్రకటిస్తూ ముందుకెళ్ళిపోయాడు. వెనకే కాళ్లీడ్చుకుంటూ వచ్చిన ముసిలాయన మద్దులేటిని చూడగానే జిప్‌బాగ్‌ను పక్కనపెట్టి 'దిక్కుమాలిన సంత! యీ వయసులో నేనాదేశంగాని దేశంలో స్థిరపడతానని అనుమానంట! రిటయిరు కాకముసుపే ట్రై చేసివుండాల్సింది బాబూ! పొరబాటు

వాదే!" అని యింతలో యేదో జ్ఞాపకమొచ్చిన వాడల్లే బాగ్ పైకెత్తుకుని "వెళ్ళాలి నాయినా! సర్కారు యెక్స్‌ప్రెస్ టయమైపోతంది. మళ్లీ మూడునెలల తర్వాత యింత ప్రయాణమూ తప్పదు.." అని గగలుపోసుకుంటూ వడుచుకెళ్ళి పోయాడు.

తన చోటును పక్కమనిషి కప్పగించి తోపుడుబండి దగ్గరకికెళ్ళి రెండు ఆమ్లేట్లు నాలుగు బ్రెడ్‌ముక్కలు తిన్నాడు మద్దులేటి. షోడా బండి దగ్గరికెళ్ళగానే పక్కనే నిలుచుని దోసకాయ ముక్క నములుతున్న గుమ్మటంలాంటి యువతి అతడినోసారి తేరిపార జూసి "నా కయితే టెన్షనే లేదు సుష్మా!" అంటూ తన పక్కనున్న పొట్టి పిల్లతో కబుర్లు కొనసాగించింది. "ఫ్లాస్‌కు పీసా యివ్వక పోతే యింకెవరకిస్తారు? వీసా యింకో గంటలో చేతికొచ్చేస్తుంది. తర్వాత వుడ్‌లాండ్స్‌లో పార్టీ యివ్వాలమ్మాయ్ నువ్వు!"

మళ్ళీ క్యూలోకొచ్చి కూర్చున్నాడు మద్దులేటి.

రోడ్డుకటువైపున అడుగు వెడల్పున్న సిమెంట్ చప్టాపైన జానెడు వెడల్పున్న నీడలో మనుషులు బారులు తీరుతున్నారు. కడుపు చల్లబడడంతో కునికిపాట్లు పడసాగాడు. ముందుకు వొంగటో యిన అతడి భుజాన్ని పట్టి కుదుపుతూ 'జాగ్రత్తండీ! టౌను బస్సేదైనా వూగుతూ వచ్చిందంటే ప్రమాదం" అన్నాడు గడ్డం యువకుడు.

తల విదుల్చుకుంటూ కళ్ళు తెరిచి మద్దులేటి యెండిపోతున్న పెదవుల్ని పొగదీయడానికి ప్రయత్నించాడు.

క్యూలోని వ్యక్తిని అభ్యర్థించి మద్దులేటి పక్కనే కాస్తస్థలం సంపాదించుకుని కూర్చున్నాడు రమణ్ జీ. "కాంతాలక్ష్మి వాళ్ళేమైనా కనిపించారా మీకు? అదేనండీ, పొద్దున మీ పక్కన కూర్చున్నారే, డాన్సరూ వాళ్ళు.. మనూరేం లేదు. యెంబసీ వాళ్ళు యేవైనా సర్టిఫికెట్లు కావాలన్నారు. యెలిమెంటరీ స్కూల్లో, హైస్కూల్లో చాలా సర్టిఫికెట్లే వచ్చాయి. ఆ తర్వాత బిజినెస్‌లో పడి యెప్పుడూ పాడలేదు. యిలా వీళ్ళు అడుగుతారని తెలిసుంటే పాడుతూనే వుండేవాణ్ణి!" అని వాపోయాడతను. కాస్సేపాగి స్వగతంలా "ఫస్టుకే అక్కడ ప్రోగ్రాం. రెండు మూడు బిజినెస్ కాంట్రాక్టులైనా సంపాయించుకొని రాకపోతే యెంత వృధా!" అని గొణుక్కున్నాడు. తర్వాత "పొద్దున కాంతాలక్ష్మి ఫైల్లో కొత్త రూపాయి నోట్లలా తళతళమంటున్న సర్టిఫికెట్లు చూశాను. యేదో నొక అసోసియేషన్ పేరుతో రెండు సర్టిఫికెట్లు ప్రింట్ చేసుకుంటే సరిపోతుంది. రేపు సర్టిఫికెట్లతో వస్తానని వాళ్ళ దగ్గర పర్మిషన్ తీసుకున్నాను.. సార్, సార్ యెవరైనా యీవూరి ప్రెస్‌వాళ్ళు తెలుసా మీకు!" అంటూ మద్దులేటి చేతుల్ని గట్టిగా పట్టుకుని బ్రతిమాలసాగాడతను.

సుడితిప్పిన మీసాలున్న సన్నటి మనిషొకడు మద్దులేటి అవతలి భుజంపైన చెయ్యేసి "కూవదాలంగు.." (పిలుస్తున్నారు) అన్నాడు.

జేబులో మిగిలిన నోట్లను తడిపిచూసుకుంటూ, రమణ్‌జీ పట్టులోంచి విడివడి 'వస్తుండా పద' అంటూ పైకి లేచాడు మద్దులేటి.

రోడ్డుపై నడుస్తున్న బొమ్మల చొక్కా యువకుడొకడు మద్దులేటి వైపోసారి నిలబడి చూసి, యెక్కడ చూసిన ముఖమో గుర్తుకు రాక తలగోక్కుంటూ "నీలిమా, చెప్పేదానికి మర్చిపోయినాను. నీ సారీలన్నీ సర్దుకో. అక్కడ కాస్ట్లీ!" అని వెనక్కు తిరిగి చూసి, భాగా ముందుకెళ్ళిపోయిన పంజాబీ డ్రస్సు అమ్మాయిని "ఆగ్గాగు. నేనూ వస్తావుండాను గదా!" అని విసుక్కుంటున్నాడు.

తన భుజంపైని చెయ్యి తియ్యకుండా లాక్కుపోతున్న ఆగంతకుడితో "యింకా యాడికి? యెవరు నువ్వు?" అని అడిగాడు మద్దులేటి అనుమానంగా.

రోడ్డు మలుపు తిరిగిన తర్వాత, పాత చర్చి గేటు పక్కనున్న నలుగురైదుగురు మనుషుల్ని చూపెట్టాడు మీసాలతను.

యెముకల ప్రోగులా కనిపిస్తున్న పొడవాటి మనిషి మద్దులేటిని తేరిపారజూసి "యెంద స్టేట్‌కుడా పోతావుండావు గోల్టి!" అని అడిగాడు కోపతాపాలేవీ ధ్వనించని తాపీస్వరంతో.

మద్దులేటి పెదవులు కదిలాయి. మాటలు మాత్రం వూడిపడలేదు.


"యెందూరు దా?" అతనే మళ్ళీ ప్రశ్నించాడు.

"యేవూరైతే నీకేంలే!" అన్నాడు మద్దులేటి బింకంగా.

గుంపులోని వాళ్ళందరిలోనూ కొంచెం బలంగా కనిపిస్తున్న వ్యక్తి మద్దులేటి భుజంపైన చెయ్యివేసి, మరో చేత్తో అతడి జేబులో మిగిలిన నోట్లని బలవంతంగా వూడబెరుక్కున్నాడు. మద్దులేటికి చెప్పలేనంతా కోపం వచ్చింది. మెలితిప్పిన వెదురుబద్దలా అతడిపైకి ఎగిరి దూకాడు. అతను నొడుపుగా పక్కకు తప్పకుని కాలుముందుకు చాపాడు. మద్దులేటి దభీమని నేలపైన పడ్డాడు. గుంపులోని వాళ్ళందరూ పెద్దగా నవ్వసాగారు.

మదుటిపైన చీరుకు పోవడంతో పెద్దగా మంట పెట్టసాగింది అతడికి. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పైకి లేవనియ్యకుండా మరొకడు అతనిపైకెక్కి కూర్చున్నాడు.




"యిదు మెడ్రాసుడా! యింగె వుపక్కెన్న పనికి యింగ యిట్లా దుడ్డువచ్చే పని వుండాదని మీ వూరుదాంకా తెల్సిపోయిందా?" పొడవాటి వ్యక్తి అదే స్వరంతో అడిగాడు.

"నిన్నరాత్రి మౌంట్‌రోడ్డుతో పోతాంటే పోలీసులు గదుముకున్నారు. యాడికి పోవాల్నో తెల్లే. యీపక్క క్యూలో మనుషులు కనపడితే వొచ్చి కూర్చుంటిని. అప్పుడు యిట్ల తావుకు కూడా లెక్క ప్పురని ప్రమాణ పూర్తిగా తెల్దు నాకు.." రెండు చేతులతోను మట్టిని చిర్లాడుతు, తనపైన కూర్చున్న వ్యక్తిని కిందికి తోయడానికి ప్రయత్నించసాగాడు మద్దులేటి.

"అన్నకు పురియాదుడా! కిండలా! యీపక్క యింక తెంబడితే తోలు వొలిచేద్దును. మాదర్చోద్.. యెవుడు వీసావోడో, యెవుడు ప్లేసమ్ముకునేదానికి వచ్చుండాడో మాకు తెల్సుడా! నీ మాదిరి వుండా కోరుల్ని యిందర్ని జూస్తుండాము" నో చేత్తో పిడికెడు జుట్టుపట్టుకుని చూపించాడు పొడుగు మనిషి.

అంతవరకూ నొక్కి పట్టుకున్న వ్యక్తి పట్టుసడలించగానే పైకి లేచి నిలుచుని "నా లెక్క.." అని సైగ చేశాడు మద్దులేటి.

మీసాలతను అతని వీవుపైన పెద్దగా రెండు గుద్దులు గుద్ది ముందుకు తోస్తూ "పోడా పో! లెక్క సరిపోచ్చి" అని పెద్దగా నవ్వాడు.

"యినముక్కు వొరడికుడుంగు. సిన్మాస్టారుకు చీస్టాయెండంకుడుత్త పోక్కిరి పయయినను"(నీకో దెబ్బ యివ్వండి. సిన్మా స్టార్‌కి చీప్‌గా తానిచ్చి పోకిరీ వీడు) అంటూ గుంపులోంచి మరో వ్యక్తి మీసాలవాణ్ణి యెగతాళి చేస్తున్నాడు.

వెనుదిరిగి చూసే సాహసం చేయలేక ముందుకే నడిచాడు మద్దులేటి.

దూరంగా జెమినీ సర్కిల్ బ్రిడ్జికింద మొండి గుర్రాన్ని అదుపులో పెడుతున్న వీరుడి విగ్రహం సిమెంటు సాలెగూట్లో చిక్కుకున్న కీటకంలా దయనీయంగా కనిపిస్తోంది. అమెరికన్ కాన్సలేట్ భవనం గోడలకవతలున్న క్యూ మాత్రం కనిపించడం లేదు.

లోపల కోటల్లాంటి యిళ్లెక్కడున్నాయో తెలియనివ్వకుండా పెరిగిన విశాలమైన తోటల పక్కన, బారులు తీరిన పెద్ద పెద్ద అంగళ్ళ పక్కన, అయిదారు వాహనాలు నొకేసారి వెళ్తున్నా యింకా బోలెడంత ఖాళీస్థలం కనిపిస్తున్న వెడల్పాటి రోడ్ల పక్కన, కాళ్ళీడ్చుకుంటూ నడవసాగాడు మద్దులేటి.

తనలో స్థలం లేని మనుషుల్ని కిందికి విసిరేయలేని భూగోళపు భూమ్యాకర్షణ శక్తిపైన అతడికి బోలెడంత కోపం వచ్చింది. తనకోసమంటూ సూదిమొన మోపినంత చోటయినా లేని చోట బతుకుకాని బతుకు బతుకుతున్న తనలాంటి మనుషులపైన అలవిమాలినంత కోపమొచ్చింది మద్దులేటికి.